## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు యూరప్ దేశాల అధికారిక పర్యటన నిమిత్తం ఈరోజు బయలుదేరి వెళ్లారు.
- జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన షట్లర్ పీవీ సింధును రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి అభినదించారు.
- రేపటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో నిర్మాణాత్మక చర్చలు జరిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు.
- రానున్న ఆరు రోజుల పాటు వాయవ్య, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు యూరప్ దేశాల అధికారిక పర్యటన నిమిత్తం ఈరోజు ఢిల్లీ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె మోల్డోవా, నార్త్ మాసిడోనియా, రొమేనియా దేశాల్లో పర్యటించనున్నారు. రాష్ట్రపతి మొదటగా మోల్డోవా దేశానికి చేరుకుంటారు. ఒక భారత రాష్ట్రపతి మోల్డోవాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ పర్యటనలో ఆమె ఆ దేశ మహిళా అధ్యక్షురాలు మాయా శాండుతో భేటీ అయి, ఉన్నత స్థాయి ప్రతినిధుల చర్చలు జరుపుతారు. అనంతరం జులై 21, 22 తేదీల్లో రాష్ట్రపతి నార్త్ మాసిడోనియాలో పర్యటిస్తారు. ఆ దేశ అధ్యక్షురాలు సిల్జనోవ్స్కా-దావ్కోవా (Siljanovska-Davkova) తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. తదుపరి జులై 23 నుంచి 25 వరకు రాష్ట్రపతి ముర్ము రొమేనియాలో పర్యటిస్తారు.

= = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈరోజు పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో దాదాపు 40 రాజకీయ పార్టీలకు చెందిన 50 మందికి పైగా నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులను ఉభయ సభల ముందుకు తీసుకువచ్చి, చర్చించి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఈ వర్షాకాల సమావేశాలు వచ్చే నెల 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = =

రేపటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో నిర్మాణాత్మక చర్చలు జరిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు. అఖిలపక్ష సమావేశం అనంతరం ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడారు. సభను అడ్డుకోవడం కంటే

అర్థవంతమైన చర్చలు జరపడమే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ అందరిదని, సభ సజావుగా సాగడంలో అన్ని రాజకీయ పార్టీలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులు, శాసనపరమైన అంశాలను ఉభయ సభల ముందుకు తీసుకురానుందని మంత్రి రిజిజు పేర్కొంటూ...

(వాయిస్...25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతక విజేత పి.వి.సింధు ప్రతిష్ఠాత్మక 'జపాన్ ఓపెన్' సూపర్ 750 టోర్నమెంట్‌లో ఛాంపియన్‌గా అవతరించి.. ఈ టైటిల్ గెలుచుకున్న మొట్టమొదటి భారతీయ షట్లర్‌గా రికార్డులకెక్కింది. ఈరోజు జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో పీవీ సింధు జపాన్ కు చెందిన అకానె యామగుచిని ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. జపాన్ ఓపెన్‌లో చారిత్రాత్మక విజయం సాధించిన పి.వి.సింధును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం వేదికగా అభినందించారు. సింధు సాధించిన ఈ విజయం భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే ఒక అత్యంత కీలకమైన ఘట్టమని రాష్ట్రపతి అభివర్ణించారు. పి.వి.సింధు గెలుపు ప్రతి భారతీయుడి గుండెల్లో గర్వాన్ని నింపిందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ విజయం భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే ఒక చారిత్రాత్మక మైలురాయి అని, సింధు ప్రదర్శించిన అసాధారణమైన ఆటతీరు అద్భుతమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = =

జమ్మూకశ్మీర్ సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరీలలో ఈరోజు సంభవించిన ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు గల్లంతయ్యారు. పూంచ్ జిల్లాలోని సూరంకోట్ తహసీల్ పరిధిలోనే అత్యధిక ప్రాణనష్టం సంభవించినట్లు తెలుస్తోంది. గల్లంతైన వారి కోసం రెస్క్యూ టీమ్‌లు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

భారత పర్యటనలో ఉన్న టాంజానియా స్వయంప్రతిపత్తి ప్రాంతం 'జాంజిబార్' అధ్యక్షుడు, విప్లవాత్మక మండలి ఛైర్మన్ డాక్టర్ హుస్సేన్ అలీ మ్విన్యి (Hussein Ali Mwinyi ) ఈరోజు ఢిల్లీలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో భారత్-టాంజానియా మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై ఇరు నేతలు సమీక్షించారు. ఈ సమావేశం అనంతరం ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ.. జాంజిబార్, టాంజానియాల అభివృద్ధి ఆకాంక్షలకు భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

సంస్కృతి, భాష లేకుండా దేశం లేదా ప్రాంతం మనుగడ సాగించలేవని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కోల్‌కతాలోని జాతీయ గ్రంథాలయంలో నిర్మించిన 'మ్యూజియం ఆఫ్ వర్డ్' మొదటి దశను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పునరుజ్జీవింపజేయడంలో ఈ ప్రాజెక్ట్ ఒక ప్రధాన ముందడుగు అని అభివర్ణించారు. భావోద్వేగాల నుండి పుట్టిన పదాలు లేకుండా భాష కూడా మనుగడ సాగించలేదన్నారు. మన భవిష్యత్ తరాలు ఈ విషయాన్ని అర్థం చేసుకుంటేనే దేశ సాంస్కృతిక పునరుజ్జీవనం సాధ్య పడుతుందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్...27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు మంగళ్ పాండే జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి స్పందిస్తూ..

మాతృభూమి ఆత్మగౌరవాన్ని, ప్రతిష్ఠను కాపాడేందుకు మంగళ్ పాండే తన ప్రాణాలను పణంగా పెట్టారని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = =

లడఖ్ లోని పుగా వ్యాలీలో దేశంలోనే మొట్టమొదటి సారిగా 'భూగర్భ ఉష్ణశక్తి' (జియోథర్మల్) బావులను విజయవంతంగా ఏర్పాటు చేసినట్లు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. భారతదేశపు మొట్టమొదటి ఒక మెగావాట్ జియోథర్మల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ఇది మార్గాన్ని సుగమం చేసిందని ఆయన సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. సముద్ర మట్టానికి దాదాపు 14 వేల అడుగులకు పైగా అసాధారణ ఎత్తులో, భూమి లోపలికి వెయ్యి మీటర్ల లోతు వరకు ఈ బావులను తవ్వినట్లు ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

లండన్ లోని లార్డ్స్ మైదానం వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. ముందుగా టాస్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 387 పరుగులు చేసింది. అనంతరం 388 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ జట్టు 5 ఓవర్లు పూర్తయ్యేసరికి వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

రానున్న ఆరు నుంచి ఏడు రోజుల పాటు వాయవ్య, ఈశాన్య రాష్ట్రాల్లో రుతుపవనాలు అత్యంత చురుగ్గా కదలనున్నాయని, దీనివల్ల భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ ఐలాండ్స్ నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు విస్తరించిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉత్తరాది రాష్ట్రాలలో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రేపు, ఎల్లుండి జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పిడుగులు పడతాయని, 21 సెంటీమీటర్లు దాటి వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బిహార్, సిక్కిం, అస్సాంలలో అతి భారీ వర్షాలు.. రాజస్థాన్, గుజరాత్, ముంబై, కేరళలలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =